
ఉత్తమమైన ఆదర్శం ఎన్నుకొని, దానికి జీవితం అంకితం చేసుకొనడం గొప్ప విషయం. కీర్తి కాంక్ష తోడు అయితే విజయం లభిస్తుంది. కాని జీవితానికి ఒక లంగరు అంటూ లేకపోతే అంధకారం ఎదురు అవుతుంది.



# తెలియని విలువలు

శ్రీరాం

"అమ్మా! అమ్మా!" అంటూ అప్పుడే గుమ్మంలోకి అడుగు పెడుతూ అమితానందంతో అరిచింది అరుణ.

అరుణ కేకలకు పార్వతి వంటింట్లోంచి వచ్చి "ఏమిటమ్మా?" అంది ఆశ్చర్యంగా.

అరుణ మధ్యగదిలో ఉన్న సోఫాలో కూర్చుంటూ, "ఇట్లా వచ్చి కూర్చో అమ్మా. నీ కో మంచి సంగతి చెబుతాగా" అంది.

అరుణ అమితానందంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నది. మనసులోని సంగతిని ఏవిధంగా తెలియబర్చాలో తట్టడంలేదు. తనకు దగ్గరగా వస్తున్న తల్లివైపు గర్వంగా చూసింది.

అందంగా ఉన్న అరుణ ఈ రోజు మరింత అందంగా కనుపించింది పార్వతికి. మేలిమి బంగారంలాంటి ముఖంలోంచి క్రొత్త కాంతి ప్రకాశిస్తున్నది. వెడల్పాటి కన్నులలోంచి వింత వెలుగు తొంగి చూస్తున్నది. గులాబి చెక్కిళ్ళు ఎరుపు రంగును పులుముకున్నాయి. లేత పెదవులమీద చిరునవ్వు చిందులు తొక్కుతున్నది.

అరుణలోని అందానికి ముగ్ధురాలై పార్వతి దగ్గరగా వచ్చి, నుదుటిమీద పడుతున్న శిరోజాలను సరిదిద్దుతూ, కూతురు కళ్ళలోని అమృతాన్ని గ్రోలుతూ ఆప్యాయతతో అడిగింది: "ఏమిటమ్మా ఆ సంగతి?"

"కూర్చో మరి. చెబుతా" అంటూ సోఫాలో ఒక పక్కకు జరిగింది అరుణ.

పార్వతి ప్రశ్నార్థకంగా చూస్తూ కూర్చుంది.

"మా కాలేజి వార్షికోత్సవానికి నాట్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇవాళ అప్పుడే ఒక రిహార్సల్ కూడ అయిపోయింది. అబ్బ! ఎంత మెచ్చుకున్నా రనుకున్నావ్! మరణించిన మంజులత తిరిగి జన్మించింది అన్నారు. నా నృత్యానికి పాట పాడటానికి ఏ జిక్కినో, లతనో తీసుకురావాలనుకుంటున్నారు. ఇవాళ నిజంగా నా కెంతో ఆనందంగా ఉంది. మంజులత అంత కావాలనుకున్న నా కోరిక తప్పక ఫలిస్తుంది అనిపిస్తున్నది. ఏమ్మా, నేను మంజులత అంత కాలేనా? నీకు సంతోషంగా ఉందికదూ!" అంటూ ఏకధాటిగా చెప్పుకుపోతున్న అరుణ, తల్లి ముఖంలోకి చూసి నీరుకారిపోయి అమితాశ్చర్యంతో ఆపేసింది సంభాషణను.

పార్వతి ముఖం పాలిపోయింది. నిశ్చేష్టురాలై అరుణవేపు అర్థరహితంగా చూసింది. గుండెల్లో అగ్నిగోళాలు బద్దలవుతున్నాయి. కళ్ళల్లో కోపం,

పడుతున్న కంఠంతో అంది పార్వతి.

"నాకు నాట్యం అంటే చాలా ఇష్టం. నాకు మంజులత అంతదాన్ని కావాలని ఉంది. నా ఇష్టాన్ని వ్యతిరేకించకమ్మా. నీకు తెలుసుగా, మంజులత ఎంత పెద్ద నాట్యగత్తో! ఆంధ్ర దేశంలో మంజులత లేని కొరతను నేను తీర్చాలని ఉంది. పాపం! మంజులత బతికి ఉంటే ఈ పాటికి విదేశాల్లో కూడ మంచి పేరు ప్రఖ్యాతులు—తనకేకాకుండా—మన దేశానికి కూడ తీసుకువచ్చేది. నాకు ఆలోటు తీర్చాలని ఉంది. నా నృత్యాన్ని ఎంతోమంది మెచ్చుకున్నారు. అందరూ మంచి భవిష్యత్తు ఉంది — అంటూ అభినందించేవారే. కాని నువ్వు ఎందుకు ఇష్టపడటంలేదో నాకర్థంకావటం లేదు" అంది అరుణ కంఠం మార్చి.

"అరుణా! నీతో మంజులత గురించి, ఆమె నృత్యాన్ని గురించి వాదించలేను. నన్ను అనవసరంగా క్షోభపెట్టకు. నీకో సంగతి చెబుతాను. అది విని నీ ఇష్టం వచ్చినట్లు నీవు చెయ్యి. ఇక నేను నీకు ఏవిధంగాను అడ్డురాను" అంది పార్వతి అమితమైన బాధతో.

"ఏమిటది?" ఆశ్చర్యంతో అడిగింది అరుణ.

"వింటావా?"

"చెప్పమ్మా! తప్పకుండా వింటాను." ఆత్రుతతో అడిగింది.

అరుణలో ఇప్పుడు తన తల్లిమీద కోపం లేదు. తన తల్లిలో వచ్చిన మార్పుకు కారణం ఇప్పుడు ఊహించుకోగలిగింది. ఎవరికో, ఏదో జరిగిన సంఘటనను చెప్పి తన మనస్సు మార్చటానికి ప్రయత్నిస్తున్నట్లుంది అని అనుకుంది. కాని తను దానికి సరియైన సమాధానం చెప్పి తన తల్లికి నచ్చచెప్పవచ్చని నిశ్చయించుకుని ఏం చెబుతుందా అని ఎదురు చూసింది.

"పద. అట్లా మంచంమీద కూర్చుందాం" అంటూ పార్వతి వచ్చి మంచంమీద కూర్చుంది. అరుణ దగ్గరలో ఉన్న కుర్చీ లాక్కుని కూర్చుంది.

పార్వతి ముఖం గంభీరంగా ఉంది.

అరుణ "ఊ! చెప్పు" అంది.

"చెబుతాను. కథలు చెప్పినంత తేలికగా జీవితాన్ని చెప్పలేం. జీవితాన్ని చెప్పటానికి కావలసినంత తాహతు నా వద్దలేదు. అందుకే ఎట్లా మొదలుపెట్టాలో తెలియక తికమకపడుతున్నాను. ఒక్కక్షణం ఆగు. ఆలోచించనీ" అంది పార్వతి.

అరుణ ఆశ్చర్యపడింది. అమ్మలో గంభీరత ఆమెను మౌనంలోకి దింపింది. అమ్మ ఏం చెబుతుందా అన్న ప్రశ్న మొదటిసారిగా కలిగింది.

పార్వతి ఉన్నట్లుండి అరుణవైపు, ఆకాశం వైపు చూసి చెప్పింది:

"మాధవి చాలా అందగత్తె. పదహారేళ్ల వయస్సులో పసిడి బంగారంలా తళతళలాడుతుండేది. సన్నగా, నాజూగ్గా ఉండేది. పెదవుల మీద చిరునవ్వు, కళ్లల్లో చిలిపి చూపు శాశ్వత స్థానాన్ని ఏర్పరుచుకున్నాయి. అంత అందమైన అమ్మాయి ఆ కాలేజీలోనే కాదు, ఆంధ్రదేశంలోనే లేదు అనుకునేవారు. ఆమె చదువుతున్న కాలేజీలోనే చదవటం ఒక ఘనంగా భావించేవారు విద్యార్థులు. మాధవితో స్నేహంచేయటం మిగతా కాలేజీ అమ్మాయిలు ఒకవరంగా అనుకునేవారు.

మాధవిలో కేవలం అందమేకాదు, అన్నీ ఉన్నాయి. చదువు, సంగీతం, నృత్యం—అన్నింట్లోనూ అందెవేసినచెయ్యి. చిన్నప్పటినుంచీ ఆమె తల్లి ఆమెకు నృత్యం నేర్పించింది. ఆమె నృత్యం చేసేటప్పుడు 'ఆమె నృత్యంకోసం పుట్టిందా? లేక నృత్యం ఆమెకోసం పుట్టిందా?' అని ఆశ్చర్యపడేవారు. చిన్నప్పటినుంచీ ఆమెకు నృత్య ప్రదర్శనలు ఇవ్వటం అలవాటయింది. ప్రతిచోటా ఆమె నృత్యానికి అభినందనలు వచ్చేవి. ఆమె నృత్యంలేని సభలు, సమావేశాలు అసంపూర్ణంగా అగుపించేవి.

హైస్కూలులో చదివినంతకాలమూ ఆమె ఊరుదాటి వెళ్లలేదు. పేరుమాత్రం పక్క ఊళ్లు దాటిపోయింది.

మాధవి కాలేజీలో చేరింది. మనిషి నిండుగా, ఠీవిగా తయారయింది. ఆమెకు అప్పటికే ఆంధ్రలోని పలు ప్రదేశాలనుంచి ఆహ్వానాలు రాసాగాయి. మాధవి మొట్టమొదటిసారిగా ఊరు దాటి వెళ్లింది. అదీ—అఖిల భారత కళాశాలల నృత్య సంగీత పోటీలలో పాల్గొని ఆంధ్రకు పేరు తీసుకువచ్చింది. దానితో ఆమెకు అభినందనలు, ఆహ్వానాలు పెరిగిపోయాయి. మాధవిలో కీర్తికాంక్ష తల ఎత్తింది. తన జీవితాన్ని నృత్యకళకే అంకితం చేయాలని నిశ్చయించుకుంది.


ఊ! చెప్పటం మరిచేపోయాను. ఆమెకు ఒక అక్క కూడ ఉంది. ఆమెకు చిన్నప్పుడే పెళ్లి అయిపోయింది. మిగిలింది మాధవి ఒక్కతే. మాధవికి కూడ పెళ్లిచేసి తన బాధ్యత తీర్చుకుందామని ప్రయత్నించింది వాళ్ల అమ్మ.

కాని, మాధవి అప్పటికే చాలా పెరిగిపోయింది. వయస్సులో కాదు, నృత్యంలోను, కీర్తిలోను. ఆమె జీవితానికి ధ్యేయం 'నృత్యం' తప్ప వేరేదీ లేదనే నిశ్చయానికి వచ్చింది. ఈ వివాహాలు, సంసారాలు తనకు అక్కరలేదంది. కావలసినవాళ్లు ఎన్ని చెప్పినా వినలేదు. కాలేజీలో చదువుకన్న ఇతర విషయాల్లో ఎక్కువ ప్రాముఖ్యం చూపేది. ఏ సమావేశం జరిగినా ఆమె నృత్యం ఒకటి తప్పదు.

ఆమెకు అభిమానుల సంఖ్య పెరిగిపోయింది. రోజుకు బోలెడన్ని ఉత్తరాలు. రకరకాల అభినందనలు. విలువైన బహుమానాలు. ఆమె ఆనందానికి అంతులేదు.

ఆ ఏడు కాలేజీలో చదువు పోయింది. తల్లి కూతురు మొండిపట్టుదలకు దిగులుపడి మంచం పట్టింది. బంధువులంతా దూరమయ్యారు. ఆమెకు ఇప్పుడు తనవారు, పరాయివారు అనే భేదంలేదు. అంతా ఆత్మీయులుగానే కనుపించారు. ఇదివరకటిలా ఆమె జీవితం ఒక పరిధిలో సాగటంలేదు. అంతటా విజయ విహారం సాగిస్తున్నది.

నారసింహ లేహ్యం
బంగారు చేరినది. మేహము, నిస్సత్తువ, విస్మృత్తువము హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బి రు. 3-8-0.
రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బి రు.1-4-0; పోస్టేజి రు.1-1-0.
మా క్యాటలాగు, కాలెండరు ఉచితం.
పి. సి. వి. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.




"సులేఖ"
యరియు
"బ్రీఫ్‌మన్"
ఫౌంటెన్‌పెన్‌లు
PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY-67.

35 సం. పైబడిన
స్త్రీ పురుషులకువర ప్రసాదము
35 సం. పై బడిన స్త్రీ పురుషులు మూత్రాశయపు వ్యాధులతో నిర్వీర్యులై దౌర్బల్యముతోనుందురు. వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, బాధతోకూడిన మూత్రవిసర్జన. రాత్రి లేక పగలు తరచుగా మూత్రము విడచుట. కాళ్ళ నొప్పులు. నిద్రలేకుండుట. బలహీనత మొదలగు లక్షణములకు మూత్రాశయపు వ్యాధులే కారణముకావచ్చును. పక్షవాతము కూడా తరచుగా అపాదించవచ్చును. 30 సం. నుండి యీ మూత్రాశయపు వ్యాధులకు వేలకొలది రోగులు సిస్టెక్స్ (CYSTEX)ను వాడుచున్నారు. నేడే సిస్టెక్స్ (CYSTEX)ను మీ కెమిస్టు వద్ద కొనండి. ఇది శీఘ్రముగా గుణమునిచ్చును. తప్పక తృప్తినివ్వగలదు. పూర్తిగా స్వస్థత చేకూరనిచో సైద్ధుని సంప్రదించవలెను.

ప్రతిరోజూ పత్రికలలో ఆమె నృత్యాన్ని గురించే వార్తలు.

ఆమె ప్రవాసాంధ్రలో నృత్య ప్రదర్శనలు ఇచ్చే రోజుల్లో ఆమె తల్లి మరణించింది. ఇప్పుడామెకు రక్త బంధువులు ఎవ్వరూ లేరు, దూరంగా ఉన్న ఒక్క అక్క తప్ప.

ఆమె మనస్సు ఒక్కసారిగా చివుక్కుమంది. తను ఒంటరిది అయింది అన్న సంగతి అప్పుడు తెలుసుకుంది. పరిధే లేదనుకున్న తన జీవితం

## తెలియని విలువలు

ఇప్పుడు చాలా ఇరుకని అనిపించింది.

ఒంటరి జీవితం భారం అనిపించింది. ధనం, పేరు, ప్రఖ్యాతి తన ఒంటరితనాన్ని దూరం చేయలేకపోతున్నాయి. తోడుకోసం వెతుక్కుంది. అప్పటివరకు అభినందనలు తెలిపినవారే ఆమెను దూరంచేశారు. ఒక నృత్య దర్శకుడు సన్నిహితు డయ్యాడు. కొన్నాళ్ళండి సినిమాలో చేరాలంటూ వెళ్ళిపోయాడు. మళ్లీ అతని జాడ లేదు. ఆ తరువాత ఆమె జీవితంలో చాలామంది చోటు చేసుకుని జారుకున్నారు.

ఆమె కీర్తి తార స్థాయికి అందుకుంది. ఆమె ఆంధ్రదేశంలో ఒక మహా నర్తకిగా స్థిరపడింది. కాని ఆమె ఊహించరాని స్థితికి దిగజారింది.

కొన్నాళ్లకు ఆమెలో ఒక కొత్త ప్రాణి స్థలం ఏర్పరుచుకుంది. జీవితం చిగిర్చింది. ఆనందం మొలకఎత్తింది. ఆనందావేశాలతో ఎప్పుడూ వ్రాయని అక్కకు ఉత్తరం వ్రాసింది. ఆమె పరుగెత్తుకు వచ్చింది.

'అక్కయ్యా! ఇదిగో నా జీవిత సర్వస్వం' అంటూ అందించింది.

'బంగారు పాపాయి' అంటూ ఎత్తుకుని, 'దీని నాన్న ఏరీ?' అంటూ చుట్టూ చూసింది, అక్కయ్య.

అప్పటిదాకా ఆమెకు తెలియదు తన చెల్లెలి జీవితం స్థిరపడలేదన్న సంగతి.

అక్కవేసిన ప్రశ్నకు అదిరిపడింది మాధవి.

నీరసించిన ఆమె ప్రాణాన్ని—ఎదురు చూడని ఈ ప్రశ్న ఆమె పూర్తి జీవితాన్ని పెకిలించి వేసింది.

'నన్ను క్షమించు అక్కయ్యా. ఈ చివరి క్షణంలో నిన్ను ఈ ఒక్క కోరిక కోరుతున్నాను' అంటూ పాపను అందించింది.

అక్కయ్య కళ్లలో నీళ్ళు తిరిగాయి. 'ఈ పాపను, నా కనుపాపలా చూస్తాను' అంది.

'నాలామాత్రం కానివ్వకు' అంటూ చివరి శ్వాస పీల్చింది."

పార్వతి గొంతు బొంగురుపోయింది. అరుణ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

పార్వతి తడి ఆరిన గొంతుకతో, "ఆ మాధవే మంజులత అనే పేరుతో ఆంధ్రదేశంలో ప్రఖ్యాత నర్తకిగా స్థిరపడిపోయింది" అన్నది.

"ఏమిటీ? మాధవీ, మంజులతా ఒక్కరేనా?" అంది అరుణ ఆశ్చర్యంగా.

"అవునమ్మా. స్థిరపడని ఆమె జీవితానికి మిగిలింది ఆ పేరు ప్రతిష్ఠలే. కాని అవేవీ ఆమెకు ఆనందాన్ని ఇవ్వలేకపోయాయి." చీర కొంగుతో కన్నీటిని తుడుచుకుంది పార్వతి.

"మరి ఆ పాప?" ఆర్ద్రతతో అడిగింది అరుణ.

పార్వతి వేడిగా నిట్టూర్పు విడిచి భారంగా, "ఆ పాపవు నువ్వేనమ్మా! నేనే ఆఅక్కయ్యను. మీఅమ్మ నిన్ను నాచేతుల్లో పెట్టి, తన జీవితంలా కానివ్వకని, నీ జీవితానికి స్థిరత్వాన్ని చేకూర్చమని చివరిసారిగా చెప్పివెళ్లింది" అంటూ వెంటనే లేచి క్రిందకు వెళ్లబోయింది.

అరుణ దిగ్భ్రాంతురాలైంది. వెడుతున్న పార్వతివైపు ఒక్కసారిగా చూసి, "అమ్మా!" అంటూ గట్టిగా కావలించుకుంది. ★


రాంతీర్థ బ్రాహ్మీ నూనె
(స్పెషల్ నెం. 1) రిజిష్టర్డు
చుండు, వెంట్రుకలు రాలుట మాన్పి, వెంట్రుకలను పట్టువలె మృదువుగాను; కాంతిగాను నల్లగాను చేయు అమూల్యమైన హెయిర్ టానిక్. ఇది మెదడును చల్లబరచి, జ్ఞాపకశక్తిని పెంపొందించి కండ్ల వేడిమి, నిరంతర శిరోబాధ తగ్గించును. హాయిగా నిద్రపట్టించును.
యోగాసన చార్టు — సచిత్రమైన మా యోగాసన చిత్రపటంలో చూపిన వివిధ యోగాసనముల నిరంతర అభ్యాసము వల ఆరోగ్యకరమైన మంచి శరీరదార్ఢ్యత పొందండి.
శ్రీ రాంతీర్థ యోగాశ్రం
దాదర్, బొంబాయి — 14.



TRADE MARK
SRIPADAM BRAND
KURNOOL FERTILIZERS CO.
శ్రీ పాదం బ్రాండు
మిశ్రపు ఎరువులు.
ప్రభుత్వం వారి అనుమతితో చేయబడిన
శ్రేష్ఠమైన పొగాకు మిక్చర్,
వరి, మిరప, ఉల్లి, జొన్న, వేరు శనగ మొదలగు పంటలను
అధికంగా పండించుటకు శాస్త్రీయంగా చేయబడిన
స్టాండర్డు I, II, III, IV & V మిక్చర్సు
దయచేసి ఉపయోగించండి.
ఏజంట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యకేంద్రాలన్నింటిలోను కావలెను.
కర్నూలు ఫెర్టిలైజర్సు కంపెని,
17-32, కోట, కర్నూలు A.P.